www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 15 డిసెంబర్ 2025
5
కాకినాడ



నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజిఆర్ఎస్‌లో దాఖలైన అర్జీల పురోగతి, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని వెల్లడించారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్ వివేకానంద హాలులో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని తెలిపారు. పిజిఆర్ఎస్‌కు రాలేని అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కష్టాల కడలిలో కౌలు రైతులు

- బ్యాంకులు రుణాలు ఇవ్వవు.. ప్రభుత్వం గుర్తించదు
- పంట వాళ్లది.. పరిహారం పట్టాదారులది
- పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన దిగుబడులు


వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన కౌలు రైతు

ప్రజాశక్తి - రాజోలు

జిల్లాలో కౌలు రైతులు పుట్టెడు కష్టాలు పడుతున్నారు. వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, కౌలు ధరలు గణనీయంగా పెరగడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు వర్తించక పంటలు దిగుబడి రాక అవస్థ పడుతు న్నారు. ఈ వానాకాలం సీజన్‌లో కురిసిన అధిక వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. దిగుబడులు గణనీయంగా తగ్గడంతో కౌలు రైతులు కుదేలయ్యారు. ప్రభుత్వం కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి ఉంటే తమకు కాస్తా ప్రయోజనం కలిగేదని చెబుతున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ చేపడుతామని చెప్పినా ఆచరణకు నోచుకో లేదు. సాధారణ పట్టాదారులైన కర్షకుల మాదిరి గానే తమకూ భరోసా వస్తుందని కౌలు రైతులు ఆశించారు. కానీ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు కావస్తున్నా కౌలు రైతులకు ఈ పథకం అమలుపై ఎలాంటి నిర్ణయం లేకపోవడంతో వారికి కన్నీరే మిగిలింది.

ఏపంట సాయం చేసినా..

భూములు కౌలుకు తీసుకొని పంటలు సాగుచేసినా కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదు. దీంతో వారు వ్యవసాయం చేయడానికి సుముఖత చూపడం లేదు.దీంతో కౌలు రైతులు దిక్కుతోచని పరిస్థితి. వీరికి పంట రుణాలు అందక పోవడంతో వడ్డీలకు అప్పులు తెచ్చి వాటిని తిరిగి చెల్లించేందుకు అష్టకష్టాలు గురవుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో తూర్పు, మధ్య డెల్టాలకు మొత్తం 4.80 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. కానీ వాస్తవ సాగు 4 లక్షల ఎకరాలు మాత్రమే. ఒక్క డాక్టర్ బిఆర్.కోనసీమ జిల్లాలోనే 1.70 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారుగా 3.5 లక్షల మంది పైనే కౌలు రైతులు ఉంటారని అంచనా. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1.70 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. జిల్లాలో 1.20 లక్షల మందికి పైగా కౌలు రైతులు ఉన్నారు. వీరికి పంట రుణాలు అందించి సాగుకు చేయూతనివ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రుణ అర్హత కార్డుల మంజూరుకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో 75 కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు అందజేశారు. జిల్లాలో గత ఏడాది ఇచ్చిన 1.16 లక్షల రుణ అర్హత కార్డుల్లో ఇప్పటి వరకు 70 వేల కార్డులను రెవెన్యూ అధికారులు పునరుద్ధరించారు. కాకినాడ జిల్లాలో పంటలను సాగు చేస్తున్న వారిలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్లు అంచనా. గత ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన కౌలు రైతు చట్టంతో వీరికి అన్యాయం జరుగుతోంది. సిసిఆర్ కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలు ఇస్తామని చెబుతోంది. ఈ ఏడాది 69 వేల మందికి కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకోగా 54,766 మందికి కార్డులు జారీ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 1.85 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా 2.18 లక్షల మంది రైతులున్నారు. వీరిలో దాదాపు 80 శాతం కౌలుకు తీసుకున్నవారే. 1.10 లక్షల మందికి కార్డులివ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటికి 32852 మందికి (29.87 శాతం) మంజూరు చేశారు. ఇతర వీటిలో కొంతమంది రైతులు తప్పుకోవడం, అదనంగా కొత్తవారు చేరడం జరుగుతోంది. క్షేత్ర స్థాయిలో కౌలు రైతుల మార్పు, చేర్పులు ఇప్పటికీ జరిగిపోయాయి. కానీ పాత కార్డులు పునరుద్ధరణ నుంచి కొత్త కార్డుల మంజూరు ప్రక్రియ వరకు మందకొడిగానే సాగుతోంది. ఈ కార్డులు మంజూరు చేసిన తర్వాత బ్యాంకుల ద్వారా రుణాలు అందించేందుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు బ్యాంకర్ల సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. భూమిని కౌలు రైతులు సాగు చేస్తున్నా.. వారికి రుణ అర్హత కార్డు ఇవ్వడానికి అసలు రైతులు సుముఖత చూపని పరిస్థితి రాజోలు నియోజకవర్గం లో అన్ని గ్రామాల్లో ఉంది. ఈ నేపథ్యంలో కౌలు రైతులను ఆదుకునేలా ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

అవగాహన కల్పించని రెవెన్యూ అధికారులు

రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలేదు. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే పరిశీలిస్తామని చెబుతున్నారు. కాని గ్రామీణ రైతులకు దానిపై అవగాహన ఉండడంలేదు. భూ యాజమానిని ఒప్పించడానికి రెవెన్యూ కార్యాలయానికి తీసుకురావాలనే షరతు పెడుతుండడంతో రైతులెవరూ కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ఇందుకు పట్టాదారులెవరూ కౌలు రైతులకు సహకరించడంలేదు.

పొలాలన్నీ చేపల చెరువులు

పంట పొలాలన్నీ చేపల చెరువులుగా మారుతున్నాయి. ఆక్వారంగం విస్తరించడంతో యాంత్రీకరణతో కూలీలకు సైతం ఉపాధి కరువై వలస వెళ్లాల్సిన పరిస్థితి . తాలూక భూస్వాములు పట్నాల బాట పడితే.. తర్వాత కౌలుదారులు అదే బాటలో ఉపాధి కోసం పయనమవడం జిల్లాలో నెలకొన్న పరిస్థితికి నిదర్శనం. అమలాపురం సమీపంలో వన్నెచింతలపూడి,తాండవ పల్లి,గ్రామాలలో వ్యవసాయ పంట పొలాలు అన్ని చేపల,రొయ్యల చెరువులు గా మారడంతో ఇక్కడ పరిస్థితి మరి అధ్వాన్నంగా తయారైంది.అలాగే అల్లవరం, సఖినేటిపల్లి మండలాలలో కూడా ఇదే పరిస్థితి.

కౌలు ఎలా చెల్లించాలి

వ్యవసాయం గిట్టుబాటుగా లేదు. కౌలు భూమిని తీసు కొని పంటలు సాగుచేసినా పెట్టుబడి కూడా లభించడం లేదు. నేను రెండు ఎకరాలు వరి సాగు చేశాను. సుమారు రూ.40వేలు పె ట్టుబడి పెడితే కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. వడ్డీకే సరిపోయింది. ఇక నేను భూయజమానికి కౌలు ఎలా చెల్లించాలి.

–యార్లగడ్డ శ్రీరాములు, కౌలు రైతు, బి.సావరం

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

కౌలు రైతు సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నేను మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. సుమారు రూ.75 వేలు ఖర్చులైతే పంట అమ్మగా వచ్చింది .ఇంచుమించు అంతే. పంటలకు గిట్టుబాటు ధరలు లేక సాగు భారంగా మారుతోంది. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

-బుంగ సత్యనారాయణ, కౌలు రైతు ,బి.సావరం


. విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్

16న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 2వ మహాసభ ఈనెల 16వ తేదీన తాళ్లరేవులో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కమిడి సత్యశ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 30 ఏళ్లుగా వ్యవసాయ కార్మిక సంఘం మండలంలో అనేక పోరాటాలు నిర్వహించిందని అన్నారు. ఆ నేపథ్యంలోనే సంఘం జిల్లా మహాసభ స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహా సభకు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు హాజరవుతారన్నారు. మహాసభల విజయవంతానికి ఇప్పటికే ఉపాధి కార్మికులలో విస్తృత ప్రచారం నిర్వహించామని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య స్థాపించిన వ్యవసాయ కార్మిక సంఘం దేశంలోనూ రాష్ట్రంలోనూ అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. జాతీయ ఉపాధి హామీ చట్టం తీసుకురావడంలో సంఘం కీలకంగా పని చేసిందన్నారు. అప్పటి నుంచి ఆ చట్టాన్ని రక్షించుకోవడానికి, సక్రమంగా అమలు చేయడానికి అనేక పోరాటాలు చేయాల్సి వచ్చిందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలు చేపట్టిందన్నారు. ఇటీవల పేరు మార్చి ఆర్భాటం చేస్తుందని, మార్చాల్సింది పేరు కాదని నిధులు పెంచాలని అన్నారు. కేంద్ర బడ్జెట్లో రూ.2.50 లక్షల కోట్లను ఈ చట్టానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వేస్తున్న రోడ్లు దళితులు, పేదల నివాసాల వద్ద వేయాలని అన్నారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని తిరిగి పేదలకు ఇవ్వడానికి అనేక ఉద్యమాలు సంఘం చేపట్టిందన్నారు. ఉదయ 10 గంటలకు సంఘం జెండా ఆవిష్కరణతో మహాసభ ప్రారంభమౌతుందని తెలిపారు. మండలంలోని వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు ఈ మహాసభకు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు నేరేడుమిల్లి త్రిమూర్తులు, దుప్పి అదృష్టదీపుడు పాల్గొన్నారు.

మెడికవర్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ వనమాడి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు తన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్స్ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని, ఆధునిక వైద్య సదుపాయాలతో పాటు అనుభవజ్ఞులైన వైద్యుల సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేలా రూపొందించిన ఈ క్యాలెండర్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ శుభాకరరావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాలు


సమావేశంలో మాట్లాడుతున్న జెవివి నేత సురేష్

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 21, 22, 23 తేదీల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జెఎన్‌టియు కెలో నిర్వహి స్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సురేష్ తెలిపారు. ఆదివారం జెవివి జిల్లా శాఖ అధ్యక్షులు కెఎంఎంఆర్.ప్రసాద్ అధ్యక్షతన సమావేశం యుటిఎఫ్ హోంలో జరిగింది. మూడు రోజుల పాటు నిర్వహించే సైన్స్ సంబ రాల ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు సైన్సు ప్రయోగాలు, క్విజ్, రాపిడ్ రౌండ్, పరీక్ష, ఫీల్డ్ ట్రిప్, సైంటిస్ట్‌లతో ముఖాముఖి వంటి కార్యక్రమాలతో నిర్వహణకు ప్లానింగ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం మయ్యేలా చూడాలని ఆయన కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ మండల కార్యకర్తలను సమీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌హెచ్‌పి.వర్మ బాధ్యులను ఎంపిక చేశారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మేకా సుబ్బారావు, వి.ఎస్.రెడ్డి, దాడి పద్మనాభం, సమతా కన్వీనర్ ఉమా మంగతాయారు, ఉపాధ్య క్షులు ఎన్.సూర్య నారాయణ, ఎన్.పద్మావతి, యుఎస్ఎన్.రెడ్డి, పి.పావని, సత్యనారాయణ రాజు, చంటిబాబు, రామకృష్ణ, ఈశ్వరరావు, విఎస్‌వి.సందీప్, కోటి, సతీష్, శ్రీరామారావు పాల్గొన్నారు.

విద్యా రంగంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత ప్రసాదరావు

ప్రజాశక్తి - కాకినాడ

విద్యారంగంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని యుటిఎఫ్ సీనియర్ నాయకుడు ఐ.ప్రసాదరావు అన్నారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ హోంలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య వర్థంతి సభ జరిగింది. యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో లక్ష్మయ్య చిత్రపటానికి యుటిఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర వర్మ పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నుపాటి లక్ష్మయ్య అవిశ్రాంత పోరాటం ద్వారానే ఉపాధ్యాయులకు సంఘం పెట్టుకోవచ్చనే చారిత్రాత్మక తీర్పు సాధించారని తెలిపారు. ఉపాధ్యాయులకు పెన్షన్, కముటేషన్, గ్రాట్యుటీ సాధించిన ఘనత లక్ష్మయ్యదేనని అన్నారు. నేటి ప్రభుత్వాలు పెన్షన్ తీసివేసి, కాంట్రిబ్యూషన్ పెన్షన్ అమలు చేయడం జరుగుతుందని, పోరాటాలు ద్వారానే తిరిగి పాత పెన్షన్ విధానం సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నూతన లేబర్ కోడ్స్ అమలు చేయడం ద్వారా సంఘాలకు, శ్రామికులకు నూతన అడ్డంకులు సృష్టించడం జరుగుతుందని, వీటిని సమర్థవంతంగా ఎదుర్కోవటం తక్షణ కర్తవ్యమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. బోధనేతర పనులు, యాప్స్ భారం, శని ఆదివారాల్లో సెలవులు లేకుండా అదనపు తరగతులు యాక్షన్ ప్లాన్‌తో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నదని, ఈ విధానం తక్షణమే ఉపసంహరణ చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి మాట్లాడుతూ రెగ్యులర్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయింపు చేయాలనే డిమాండ్‌తో డిసెంబర్ 18వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడు గోవింద రాజులు, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా తాజుద్దీన్‌బాబా


షేక్ తాజుద్దీన్ బాబా

ప్రజాశక్తి - కోటనందూరు

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా మండల శాఖ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ తాజద్దీన్ బాబా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.సూరిబాబు, కెవివి.నగేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకం వమ్ముకాకుండా సంఘ నిర్మాణానికి కృషి చేస్తానని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటాన్ని కొనసాగిస్తానని అన్నారు. జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సగర సంఘం అధ్యక్షుని ఎంపికపై హర్షం


ఏపూరి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సగర సంఘం అధ్యక్షునిగా గుర్రం మహాలక్ష్మి ఎంపికవ్వడం నియోజకవర్గ బిసి ఐక్య సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి విజయానికి కీలకపాత్ర పోషించిన రాష్ట్ర సగర సంగం మాజీ అధ్యక్షులు ములికే సత్యనారాయణ, మాజీ జిల్లా అధ్యక్షులు నక్క కిషోర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సగర సంగం కులస్తులంతా ఐక్యం కావాలని కోరారు. సంఘీయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా కృషి చేయాలని ఆయన కోరారు.

17న పెన్షనర్స్ దినోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 17న స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో పెన్షనర్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్యామ్‌సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ ఎ.కాళీకృష్ణ, సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఎస్.ఈశ్వరి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


రైతులతో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఆకుమడులకు నీటి యద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని తూర్పు డెల్టా ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలో ఎండపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆకుమడులకు నీటి ఎద్దడి ఉందని తెలిపిన రైతులను నేరుగా కలుసుకుని మాట్లాడారు. మూడు రోజులలో పూర్తి స్థాయిలో సాగునీటిని అందిస్తామన్నారు. పిబిసి నుంచి నీటి సామర్థ్యం పెంచేందుకు అన్ని చర్యలు చేపడుతు న్నామని అన్నారు. ఏలేరు నుంచి సోమవారం నీటిని విడుదల అవుతుందని, రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎంఎల్ఎ పెండెం దొరబాబు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మి, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, రావు అక్షయ్, తెలగంశెట్టి వెంకటేశ్వర రావు, డిఇ సంతోష్‌కుమార్, రైతులు పాల్గున్నారు.

ఒబిసి సర్టిఫికెట్లు ఇవ్వాలి


సమావేశంలో పాల్గొన్న తూర్పు కాపు సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తూర్పు కాపులకు ఒబిసి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిసిని రామచంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తూర్పు కాపులందరికీ గతంలో బిసిడి సర్టిఫికెట్లతో పాటు ఒబిసి సర్టిఫికెట్లు ఇచ్చేవారన్నారు. గత కొంతకాలంగా ఉత్తరాంధ్ర జిల్లాల మినహా మరేయితర జిల్లాల్లోనూ ఒబిసి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఒబిసి సర్టిఫికెట్ లేక తూర్పు కాపు యువత ఉన్నత విద్య, కేంద్ర ప్రభుత్వ, బ్యాంకింగ్ ఉద్యోగాలలో రిజర్వేషన్లు కోల్పోతున్నారన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, పైల సుభాష్ చంద్రబోస్, సామంతుల సూర్య కుమార్, సుంకర రాంబాబు, కోరాడ ప్రసాద్, సంఘ నాయకులు అలమండ నాగేంద్ర, కరోతు సత్యనారాయణ, కోరాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో నాగబాబు ప్రతిభ


పతకాలతో నాగబాబు

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 13, 14 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరిగిన 45వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సామర్లకోటకు క్రీడాకారులు యాతం నాగబాబు ఉత్తమ ప్రతిభను చాటుకున్నాడు. 100 మీటర్ల విభాగంలో బంగారు పతకం, 800 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం, 1500 మీటర్ల పందెంలో బంగారు పతకం సాధించాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ మధ్యప్రదేశ్‌లో నిర్వహించే 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఆయన ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడా వర్గాలు, సహచరులు ఆయనను అభినందిస్తూ, జాతీయ స్థాయిలోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

కార్టూ‘నిజం’



రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ సుబ్బరాజు

ప్రజాశక్తి - తాళ్లరేవు

నియోజకవర్గంలో రూ.40 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు తెలిపారు. ఆదివారం కోరంగిలోని ఎన్‌హెచ్ 216 నుంచి కైట్ కళాశాల వరకు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.72 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డుకు ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కల్యాణ్‌లను ఎంపి హరీష్‌మాధూర్‌తో కలిసి నియోజకవర్గ అవసరాలను వివరించినట్లు తెలిపారు. దీంతో సాస్కి నిధులు రూ.24 కోట్లు కేటాయించారని తెలిపారు. ఇప్పటికే కాట్రేనికోన మండలం వేట్లపాలెం నుంచి సిర్ర యానాం వంతెనకు రూ.10 కోట్లు, పాత కోరంగి రోప్ వే బ్రిడ్జి పక్కన మరో వంతెన నిర్మాణం కొరకు రూ.13 కోట్లు కేటాయించారని తెలిపారు. మండలంలో చొల్లంగి, చొల్లంగిపేట, కోరంగి, రామన్నపాలెం, ఇంజరం, జార్జి పేట, సుంకరపాలెం గ్రామాల్లో రూ.2.13 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాస్, ఎఇ అప్పారావు, టిడిపి నాయకులు ధూళిపూడి వెంకటరమణ, కట్ట త్రిమూర్తులు, నడింపల్లి వినోద్, టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, మందాల గంగ సూర్యనారాయణ, వేగేశ్న భాస్కర రాజు, కైట్ కళాశాల డైరెక్టర్ సత్తిరాజు, కైట్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


ట్రై ఇట్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

శ్రీ ప్రజ్ఞలో ట్రై ఇట్ పరీక్ష

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట పరిసర పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శ్రీ ప్రజ్ఞ విద్యాసంస్థ ఆదివారం ట్రై ఇట్ పరీక్షలు నిర్వహించింది. మూడు కేటగిరీల్లో పరీక్షలు నిర్వహించగా 1200 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఆ విద్యాసంస్థల ఛైర్మన్ బండారు నాగబాబు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికితీసేందుకు ఈ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు 21 తేదీన నగదు పురస్కారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.3 వేలు నగదు బహుమతిని అందిస్తామన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని జడ్.రాగంపేట శివారు ఉన్న సాయి హాస్పటల్‌లో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎపి విపత్తుల స్పందన, అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ చెల్లె అనిల్‌కుమార్, ఎల్ఎఫ్ జి.జగదీష్‌బాబు పాల్గొని అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా స్పందించాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాయి హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ ముంద్రు ఎర్రబాబు, అగ్నిమాపక అధికారులు కెవివి.శేఖర్, ఎన్‌వివి. సత్యనారాయణ, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాధులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చలిలో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తితో డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ జె.నరసింహనాయక్



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాపై చలి పులి పంజా విసురుతోంది. ఉదయం 8 గంటలు దాటినా ప్రజలు బయటకు రావడానికి ధైర్యం చేయలేకపోతున్నారు. పొగమంచు పూర్తిగా కమ్ముతుంది. చల్లని గాలులు వీస్తుండడంతో ఎముకలు కొరికే చలి ప్రజల్ని వణికిస్తోంది. దీంతో బయటకు రావాలంటే పిల్లలు, వృద్ధులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యఆరోగ్య శాకాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. ప్రస్తుతం అనారోగ్య సమస్యలు ఎక్కువగా బయట పడుతున్న నేపథ్యంలో ఆయన పలు అంశాలపై 'ప్రజాశక్తి ముఖాముఖి'లో వివరించారు.

ఎలాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.?


ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ చలిలో వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. చలి వలన ఊపిరితిత్తులు కొంత ఆయాసానికి గురవుతాయి. చర్మం పగుళ్ళ బారడం ఆరంభమవుతుంది. మిగతావారితో పోలిస్తే చలికాలం పసికందులు, వృద్ధులకే సమస్యలెక్కువ. ఈ కాలం వీళ్లల్లో రెసిస్టెన్స్ లోపించి ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గుతుంది. దగ్గుతో కఫాన్ని బయటికి తెప్పించే శక్తి లేకపోవటం వల్ల ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఎక్కువవవుతుంది.

వృద్ధులు, పసి పిల్లలపై ప్రభావం..?

వృద్ధుల్లో ప్రత్యేకించి ఆర్థరైటిస్ ఉంటే ఎముకలు మరింత బిగుసుకుపోయే ప్రమాదం ఉంది. కదలికలు తగ్గి కొన్నిసార్లు పట్టుతప్పి పడిపోయే ప్రమాదం ఉంటుంది. పసికందులను చలిగాలి సోకకుండా వెచ్చగా ఉంచాలి. స్వెటర్లు, మెత్తని రగ్గులు వాడాలి.

గుండె సంబంధిత వ్యాధులపై ఎలా అప్రమత్తంగా ఉండాలి.?

చలికాలంలోనే గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగానే ఉంటాయి. ఉష్ణోగ్రత పడిపోయినప్పుడు రక్తనాళాలు మూసుకుపోయి, రక్తాన్ని శరీర భాగాలకు పంపిణీ చేయడం గుండెకు కష్టమవుతుంది. ఈ స్థితిలో గుండె రక్తాన్ని పంపిణీ చేయడానికి ఎక్కువగా శ్రమిస్తుంది. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. ప్రత్యేకించి వృద్ధుల్లో సిస్టాలిక్, డయాస్టాలిక్ రక్తపోట్లు రెండూ పెరుగుతాయి. ఆస్తమా వ్యాధిగ్రస్తులై ఉంటే వారిలో చల్లగాలి వల్ల శ్వాసనాళాలు కుంచించుకుపోతాయి.



అందువల్ల చలి గాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవడమే పరిష్కారం.

పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు..?

ఈ నెల 21వ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేశాము. ప్రతి ఒక్కరు విధిగా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బూత్ బ్యానర్లు, స్ట్రీట్ బ్యానర్లు, గోడ పత్రికలు వేయిస్తున్నాం. మారుతున్న కాలానుగుణంగా మొబైల్ ద్వారా, వాట్స్ యాప్ మెసేజ్‌లు పెట్టడం ద్వారా జిల్లాలోని వివిధ శాఖల సమన్వయం, అందరి సహాయ సహకారాలతో విజయవంతం అయ్యేలా కృషి చేస్తున్నాం.

సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారా.?

జిల్లాలో 97 సంక్షేమ వసతి గృహాల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి మెడికల్ ఆఫీసర్ తప్పనిసరిగా వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. పిల్లలు అనారోగ్యాలకు గురికాకుండా ఎప్పటికప్పుడు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పరీక్షలు జరిపి మందులను అందజేస్తున్నాం. ఎవరికైనా ఎటువంటి ఇబ్బందులు వచ్చినా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచిస్తున్నాం.

పిహెచ్‌సిలలో వైద్య సేవలు నిరంతరం అందుతున్నాయా.?

జిల్లాలో ఉన్న ప్రతి పిహెచ్‌సిలోనూ అలాగే ఇతర ఆరోగ్య కేంద్రాలలో 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. ముఖ్యంగా పిహెచ్‌సిలలో రాత్రిపూట కూడా వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. రోగులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా తక్షణం వైద్య సేవలు అందిస్తున్నారు. అవుట్ పేషెంట్ మందుల ఇచ్చే సమయంలో ఎవ్వరికి ఇబ్బంది లేకుండా రోగులకు సేవలు అందించాలని ఆదేశించాం. ప్రతీ పిహెచ్‌సిలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పాటించాలని ఆదేశాలిచ్చాము.

'స్క్రబ్ టైఫస్' వ్యాధిపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

స్క్రబ్ టైఫస్ 'పురుగు' (కీటకం) కుట్టడం వల్ల వ్యాపించే వ్యాధి నేపథ్యంలో ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నట్లయితే అది పూర్తిగా నయం అవుతుంది. దీనిపై ఎవరు ఆందోళన చెందవద్దు. 'పురుగు' కుట్టడం గమనించినట్లయితే సమీప ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి. స్క్రబ్ టైఫస్ ఇది వైరస్ కాదు, ఓరింటియా సుత్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, కీటకం కుట్టిన చోట నల్లటి మచ్చ ఏర్పడటం ప్రధాన లక్షణం. సకాలంలో గుర్తించి చికిత్స అందించకపోతే పరిస్థితి విషమించి ప్రాణాపాయం కలగవచ్చు.

నేరాలు ఘోరాలు

డివైడర్‌ను ఢీకొని లారీ బోల్తా

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట కాకినాడ కెనాల్ రోడ్డులో స్థానిక రైల్వే గూడ్స్ షెడ్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారుజామున ఓ లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో ఇతర వాహనాలు లేదా ప్రజలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక జార్జిపేట వై జంక్షన్ చెక్ పోస్ట్ వద్ద ఆదివారం కోరంగి ఎస్ఐ పి సత్యనారాయణ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకపోవడం, ఇతర కారణాలతో 21 మందికి జరిమానా జరిమానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎఎస్ఐ మేడిశెట్టి శ్రీనివాస్ తెలిపారు.

పేరవరంలో బంగారం, వెండి చోరీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని పేరవరంలో బంగారం, వెండి చోరీకి గురియైంది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకార పేరవరం గ్రామానికి చెందిన జన్యువుల రామభక్తుడు గత నెల 25న కుటుంబంతో కలిసి బెంగళూరులో ఉంటున్న తన కుమారుడు వద్దకు వెళ్లారు. తిరిగి వారు శనివారం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తీసి ఉన్నాయి. ఇంటి లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉండవలసిన 40 గ్రాముల బంగారం, 1 కేజీ వెండి చోరీకి గురియిందని గుర్తించారు. ఆదివారం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్‌లోని స్థానిక రాజవోలులోని ఎఎంజి స్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల అనంతరం మళ్లీ ఒకచోట కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల మొత్తం ఆత్మీయ వాతావరణం నెలకొంది. పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల జ్ఞాపకాలను పంచుకుంటూ, చదువుకున్న రోజుల్లోని అనుభవాలు, స్నేహబంధాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడ్డ తమ మిత్రులందరూ ఒకరికొకరు తమ కుటుంబాలను పరిచయం చేసుకున్నారు. పాఠశాల అభివద్ధికి సహకరించాలనే ఉద్దేశంతో భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. ఈ పూర్వ కలయిక కార్యక్రమం విద్యార్థులు, గురువుల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలపరిచింది.

ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.35 వేల కోట్ల బకాయిలు సంవత్సరాల తరబడి చెల్లించకుండా తాత్సారం చేయడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్.సూర్యనారాయణ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యాలయ ఆవరణలో సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఉత్సాహంగా నిర్వహించరాఉ. రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల రామ సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన వెంటనే అసెంబ్లీలో తెలిపిన ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు 2024 25 బడ్జెట్లో ఒక్క పైసా కూడా నిధులు కేటాయించకపోవడం ఆందోళనకరం అన్నారు. కనీసం ఏ ఉద్యోగికి ఎంత బకాయి ఉందో తెలియజేయకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కుమార్ మాట్లాడారు. తాము ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని భవిష్యత్తు పోరాటాలకు సమాయత్తం అవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, కేదారేశ్వర రావు, రామచంద్రరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగసాయి మాట్లాడుతూ తమ సంఘం ప్రభుత్వ నిబంధనలకు లోబడి పని చేస్తోందని తెలిపారు. చట్టబద్ధంగా ఉద్యోగుల డిమాండ్ల కోసం నిరంతరం ఉద్యోగులతో సంప్రదించి ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. అనంతరం సమావేశంలో ప్రతిపాదించిన పలు అంశాలపై తీర్మానాలను ఆమోదించారు. తొలుత సెంట్రల్ జైలు ఎదురుగా గల సంఘం జిల్లా కార్యాలయం ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు బి.గిరి ప్రసాద్‌వర్మ, జిల్లా కార్యదర్శి సిహెచ్ఎస్.విల్సన్‌పాల్, సహాధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, కమల సుందర్, ఎ.శ్రీనివాసరావు, జివి.విజయ్ కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి పి.గోపాలకృష్ణ, జె.రాజారావు, దినేష్, ఎన్‌విఎస్.రాజు పాల్గొన్నారు.

దుర్గంధ సమస్యకు మోక్షం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

ఏళ్ల తరబడి ఎవరూ పరిష్కరించని సమస్యకు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తాము శాశ్వత పరిష్కారం చూపించామని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 41వ డివిజన్‌లోని కోటిలింగాలపేట పంప్ హౌస్ వద్ద చేపట్టిన గుర్రపు డెక్క తొలగింపు, డీ సిల్టేషన్ పనులను ఎంఎల్ఎ వాసు స్థానిక నాయకులు, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల తర్వాత స్థానిక కోటిలింగాలపేటకు విముక్తి లభించిందన్నారు. దుర్గంధంతో ఉన్న ఆప్రాంతంలో పంప్ హౌస్ దగ్గర చెరువులో డీసిల్ట్ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. పేపరు మిల్లు సహకారంతో రూ. 25 లక్షల సిఎస్సార్ నిధులు తీసుకొచ్చి, డీసిల్టింగ్ పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే గుర్రపు డెక్క తొలగించగా, రూ.కోటి 25 లక్షలతో అదనంగా మరో పంప్ హౌస్ నిర్మించామన్నారు.

తైక్వాండో శిక్షణ మనోధైర్యానికి దోహదం

ప్రజాశక్తి - కాకినాడ

తైక్వాండో శిక్షణ మనోధైర్యానికి దోహదం చేస్తుందని ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల ప్రాంగణంలో తైక్వాండో శిక్షణకు సంబంధించిన బెల్ట్ పరీక్షలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.అర్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తైక్వాండో శిక్షణ వల్ల బాలికలు మనోధైర్యంతో స్వేచ్ఛగా జీవించడానికి అవకాశం ఉంటుందన్నారు. బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్పించాలని సిఎం చంద్రబాబుకు వివరించినట్లు తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తైక్వాండో శిక్షకులను నియమించి బాలికలకు సెల్ఫ్ ప్రొటెక్షన్‌పై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. తైక్వాండో క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో రాణించిన వారికి, గతంలో బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్ ఉత్తీర్ణత సాధించిన వారికి ఆమె సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం సీనియర్ కోచ్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.అర్జునరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి రిఫరీలు, సీనియర్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఎల్‌సి పద్మశ్రీ

లయన్స్ విజన్ క్లబ్ ఆధ్వర్యాన వాటర్ ప్లాంట్ బహూకరణ

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక రామారావుపేటలోని జడ్‌పి హైస్కూల్ (ఓరియంటల్) పాఠశాలకు సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే వాటర్ ప్లాంట్‌ను లయన్స్ విజన్ క్లబ్ బహుకరించింది. ఆదివారం వాటర్ ప్లాంట్‌ను లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా వృద్ధాశ్రమాలకు సహకారాన్ని అందించడమే కాక ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అభినందించారు. వాటర్ ప్లాంటును ఆదిలక్ష్మి సోమశేఖర రావు జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు అనన్య, సోమేశ్వర్రావు, భానుమతి ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు రక్షణ మంచినీటి సరఫరాకు ఎటువంటి అవాంతరం కలగకుండా లయన్స్ జోన్ ఛైర్‌పర్సన్ ఎంఎస్ఆర్‌వి.సత్యనారాయణ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడాన్ని ఆయన అభినందించారు. లయన్స్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు నల్లమిల్లి శ్రీదేవిరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమంలో కార్యదర్శి బులుసు శ్రీవాణి, కోశాధికారి వి.జయలక్ష్మి, జోన్ ఛైర్‌పర్సన్ మణిబాబు, మాండలిక ప్రసన్న, ఈశ్వరకుమార్, లింగమల్లి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ ను ప్రారంభిస్తున్న కోటేశ్వరరావు

అనధికార లే అవుట్...!

-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - జగ్గంపేట

జాతీయ రహదారి పక్కన స్థలాలకు డిమాండ్ పెరగడంతో ఖాళీ స్థలాలన్నీ అనధికారిక లే అవుట్లుగా మారుతున్నాయి. మండలంలోని రామవరం వద్ద 216 నెంబర్ జాతీయ రహదారి పక్కనే అనధికార లే అవుట్ వేస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ వెంచర్ వేసిన స్థలంలో గతంలో పెంకుల పరిశ్రమ ఉండేది. ఆ పరిశ్రమను తీసేయడంతో ఖాళీగా ఉన్న ఆ రెండు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలుగా మార్చుతున్నారు. ఆ స్థలాన్ని అలా మార్చాలి అంటే ప్రభుత్వానికి కన్వర్షన్ ఫీజులు చెల్లించాలి. ఆ తర్వాత కూడా ద్వారా లే అవుట్ అనుమతులు పొందాలి. వారి నిబంధనల ప్రకారం 40 అడుగుల ప్రధాన రోడ్లు, 30 అడుగులు వీధి రహదారులు, డ్రయినేజ్, కమ్యూనిటీ స్థలం, పార్కు, వంటివి ఏర్పాటు చేయాలి. అవన్ని ఏర్పాటు చేసేవరకు ఆ స్థలాల్లోని కొన్నింటిని వారి అధీనంలో ఉంచుకుని అక్కడ ఆ మేరకు వివరాలతో కూడిన బోర్డును అధికారులు ఏర్పాటు చేయాలి. అన్ని పనులు పూర్తయ్యాక అధికారుల పరిశీలన అనంతరమే విక్రయాలు చేసుకునేందుకు అనుమతులు ఇస్తారు. అయితే ఇవేమీ లేకుండానే ఆ స్థలంలో కంకరతో 20 అడుగుల రోడ్లు చూపించి విక్రయాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. హైవే పక్కనే ఇంత జరుగుతున్న పంచాయితీ అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. లే అవుట్ జరుగుతున్న విషయాన్ని కూడా అధికారులకు తెలియచేయాల్సివుంది. ఆ స్థలాల్లో నోటీసు బోర్డులు పెట్టాలి. అవేమీ చేయకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు చెల్లించి నిబంధనల ప్రకారం వెంచర్ వేసే విధంగా కుడా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రాగాలును వివరణ కోరగా తాము అనుమతులు ఇవ్వలేదన్నారు. అలాగే కుడా నుండి అనుమతులు తీసుకోలేదన్నారు. లే అవుట్ వద్ద నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.



అనధికారికంగా వేసిన లే అవుట్

పెన్షనర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్స్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ విశ్రాంత శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు, ఇన్కమ్ టాక్స్ విశ్రాంత అడిషనల్ కమిషనర్ డివి.సుబ్బారావు, సిజిఎస్‌టి రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ వివిఎల్ఎన్.కమలాకరరావు, కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమాఖ్య జనరల్ సెక్రటరీ ఎస్‌విఎస్ఎన్.సాయిరామ్ పాల్గొన్నారు. కాకినాడ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా కమలాకరరావు, ఉపాధ్యక్షులు తురగా సూర్యారావు, కార్యదర్శిగా కెవిఆర్.వరప్రసాద్, సహాయ కార్యదర్శిగా కె.రాజేష్, కోశాధికారిగా పి.సాగర్, ఉపకోశాధికారిగా కెవి.కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా శరబండి రాజు, కన్వీనర్‌గా మూర్తి, కో కన్వీనర్‌గా ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు ఎ.రమణ, సిహెచ్. రామారావు, రవిశంకర్ పట్నాయక్, ఎన్‌వి.అబ్బాయి, విజయకాంతం, జెసి.చోప్రా, ఎస్.సూర్యనారాయణ ఎన్నికయ్యారు.

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక బళ్ల మార్కెట్ సెంటర్‌లోని కనక మహాలక్ష్మి అమ్మవారి గ్రామోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి గ్రామోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. గరగ నృత్యాలు, కోలాటం, నవదుర్గ అమ్మవారి నృత్యాలు, పులి వేషాలు, బ్యాండ్ మేళాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు ఎండ్రు రాము, పెద్దిరెడ్డి శ్రీను, ఆవాల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామానికి చెందిన అగ్నిప్రమాద బాధితుడు చక్రాంతి అమ్మిరాజు కుటుంబానికి ఉమర్ ఆలీషా విద్యాసంస్థల ఛైర్మన్, అఖిల్ విద్యాసంస్థల అధినేత ఇనకోటి గంగాధర్ సాయాన్ని అందించారు. ఆదివారం బాధితులను పరామర్శించి బియ్యం బస్తా, నెలకు సరిపడ నిత్యవసర వస్తువులు, రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మిరాజు కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల నవీన్, ఆకుల సురేంద్ర, నిమ్మల శ్రీను, గౌతు విజయ్, పిట్టల అభి పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సిహెచ్.మానవేంద్రనాథ్ రాయ్ తన కుటుంబంతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, సిఐ ఎ.కృష్ణ భగవాన్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ యడ్ల శ్రీనివాస్, విఆర్ఒ నల్లజర్ల మురళీకృష్ణ, చదలాడ తిరుపతి దేవస్థానం ఇఒ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



చిత్రపటాన్ని అందజేస్తున్న దేవస్థానం ఇఒ

క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

ప్రజాశక్తి - అనపర్తి

అనపర్తి రామారెడ్డి జెడ్‌పి బాలుర పాఠశాల గ్రౌండ్‌లో కోరుకొండ, రంగంపేట మండలాల ఉపాధ్యాయుల క్రికెట్ టీముల మ్యాచ్‌ను అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ నిర్వహిస్తున్న గవర్నమెంట్ టీచర్స్ క్రీడా పోటీల్లో భాగంగా రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని 10 మండలాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులకు వేరువేరుగా ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనపర్తి శ్రీరామారెడ్డి జెడ్‌పి బాలుర పాఠశాల గ్రౌండ్‌లో కోరుకొండ, రంగంపేట మండలాల క్రికెట్ టీముల మ్యాచ్‌ను ప్రారంభించామని ఎంఎల్ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం, మండల, అనపర్తి టౌన్ కూటమి నాయకులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐదో రోజు టెట్ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్ 2025) ఐదో రోజు ఆదివారం ప్రశాంతంగా సాగిందని డిఇఒ కంది వాసుదేవరావు తెలిపారు. స్థానిక లూథర్‌గిరిలోని రాజీవ్ గాంధీ గ్రూప్ అఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లోని ఇయాన్ డిజిటల్ జోన్ సెంటర్‌లో మొదటి షిఫ్ట్‌లో 955 మందికి 895 మంది హాజరయ్యారని, 60 మంది గైర్హాజర్ అయ్యారని, మధ్యాహ్నం రెండవ షిఫ్ట్‌లో 700 మందికి 631 మంది హాజరైనట్లు, 69 మంది గైర్హాజరైనట్లు డిఇఒ తెలిపారు.

వీరవరంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని వీరవరం బైబిల్ మిషన్ చర్చిలో పాస్టర్ సాకా యేసుపాదం, రిబ్కా, యేసుపాదం ఆధ్వర్యంలో మెగాగ్రాండ్ క్రిస్మస్ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ పాల్గొని క్రిస్మస్ గ్రీటింగ్స్ తెలిపారు. వివిధ సంఘాల నుంచి వచ్చిన పాస్టర్స్ కె.విజయ్‌కుమార్, ప్రకాశ్, రాజారావు, ఏసురత్నం, రత్నాకర్ తదితరులు వాక్యోపదేశం చేశారు. బిఎంసి యూత్ ఆధ్వర్యంలో నాటికలు, సాంగ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

దుమ్ముతో వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి-చాగల్లు

నిడదవోలు-పంగిడి రోడ్డు గోతులుగా ఉండటం వల్ల క్వారీ లారీలు అతివేగంతో వెళ్లడంతో దుమ్ము వల్ల వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో బ్రాహ్మణగూడెం నుంచి పంగిడి వరకూ ఆర్ అండ్ బి రోడ్డు పొడుగునా పెద్దపెద్ద గోతులు ఉండడంతో దుమ్మూ దూళీ లేసి చాలా ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులు పూడ్చి దుమ్ము నుంచి విముక్తి కల్పించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మౌనిక

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థి దశ నుంచే బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ వి.మౌనిక సూచించారు. ఆదివారం మండలంలోని దివిలి గ్రామంలో ఉన్న బిసి బాలికల వసతి గృహంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల క్రికెట్ పోటీ లో ఇరుజట్లు

ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్ స్థానిక కైట్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం ప్రారంభం అయింది. ఈ టోర్నమెంట్‌ను డివైఇఒ కెవివి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ టోర్నమెంటులో జిల్లాలోని పది మండలాల నుంచి 10 జట్లు పాల్గొంటున్నాయి. మొదటి మ్యాచ్‌లో కాజులూరు-పెదపూడి జట్లు పోటీ పడ్డాయి. ఈ కార్యక్రమంలో పలు మండలాల ఎంఇఒలు టివిఎస్.రామయ్య, డి.డేవిడ్, పి.వేణుగోపాల్, జోసెఫ్ పాల్గొన్నారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ రాజమండ్రి 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
E.P.No.30/2024 in O.S.No.500/2011

Between:-
రెడ్డి శ్రీరామమూర్తి, తండ్రి(లేటు) వీరన్న డోర్‌నెం.11-35, కటూరి నిలయం, మోరంపూడిజంక్షన్ దగ్గర,రాజమండ్రి
... D.H.R/డిక్రిహోల్డర్

And

1. పామర్తి మత్తు బాయి భర్త(లేటు) పి.వి.రమణ, L.I.G-406,A.P.H.B. కోలనీ, లాలాచెరువు,రాజమండ్రి
2. పామర్తి శ్రీనివాసరావు తండ్రి (లేటు) పి.వి.రమణ, L.I.G-406,A.P.H.B.కోలనీ, లాలాచెరువు,రాజమండ్రి
3. పామర్తి కార్తికేయ తండ్రి (లేటు) పి.వి.రమణ,L.I.G-406, A.P.H.B. కోలనీ, లాలాచెరువు,రాజమండ్రి.
...J.D.Rs/జడ్జిమెంటార్స్

ఈదిగువ షెడ్యూలుదాఖలా J.D.R-S తాలూకుస్థిరాస్తి యిస్తిహారు షరతులకు లోబడి **ది.20-01-2026** తేది ఉదయం గం॥ **10-30ని॥ల** లగాయితు పైన తెలిపిన కోర్టులోశ్రీ కోర్టువారిచే వేలం వేయబడును. వేలంపాట వివరములు మొదలగు సంజాయిషీ కావలసినవారు DHR తరపు Advocate వారి ఆఫీసు నందు తెలుసుకొనవలెను.

విక్రయ ఆస్తి షెడ్యూలు

తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, రాజానగరం సబ్ రిజిస్ట్రార్, లాలాచెరువు A.P. Housing Board కాలనీ చ॥గ॥130-లు గల R.C.C. బిల్డింగు మరియు స్థలము-డోర్‌నెం. 1-422 (పాతడోరునెంబరు)కు కొత్తడోరు నెం.113-1-278, ఇంటికి హద్దులు **తూర్పు:**30-0 feet వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:**M.I.G.-1 ఇంటినెం. 407, **పడమర:**M.I.G.-1- ఇంటి నెం. 405, **ఉత్తరం:**40-0feet -వెడల్పు గల రోడ్డు-యావత్తు యీజిమెంటు హక్కు లతోసహా,

DHR. విలువ: Rs.32,00,000/-
అమీనా విలువ:Rs.25,00,000/-
S.R.O.విలువ:Rs.29,63,000/-
JDR విలువ : Not given.

చల్లా దుర్గాప్రసాదరావు
చల్లా చంద్రశేఖర్,
చల్లా NVభారతి,
సూరెడ్డిరమేష్
రాజమండ్రి అడ్వొకేట్స్, రాజమండ్రి,
12-12-2025 ఫోన్:9966674555

మహారాజశ్రీ గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్), ప్రత్తిపాడు వారి కోర్టు యందు
O.S. No. 272/2023

Between:
చామర్తి దుర్గాప్రసాద్ **-పిటీషనరు/వాది**

AND

షేక్ మెహబూబ్ జాని **-రెస్పాండెంట్/ ప్రతివాది**

ప్రకటన

పై నెంబరు కేసును పై కోర్టులో వాది/పిటీషనరు, రెస్పాండెంట్/ ప్రతివాదిపై దాఖలు చేసినారు. రెస్పాండెంట్/ప్రతివాది అయిన షేక్ మెహబూబ్ జాని,S/o.షేక్ అమీర్ జానీ, డోర్‌నెం.16-34-28, సాంబమూర్తినగర్ 2వవీధి,కాకినాడ అర్బన్ మండలం కాకినాడ జిల్లాకు శ్రీయుత కోర్టు వారి నుండి ఎన్నిసార్లు నోటీసులు, సమన్లు పంపినా తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నారు. రెస్పాండెంట్/ ప్రతివాది అయిన షేక్ మెహబూబ్‌జాని హాజరుపై గౌరవనీయ కోర్టు వారు ది. 16-12-2025 వ తేదీ నాటికివాయిదా వేసినారు. **ది. 16-12-2025 వ తేదీన** రెస్పాండెంట్/ ప్రతివాది పై కోర్టులో స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తన ఆక్షేపణలు తెలియజేయవలెనని, అట్లు కాని యెడల పరోక్షమున కేసు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆర్డరుపై)

బొంగులూరి మధుబాబు
అడ్వకేట్, డో.నెం.8-71
ఆర్.సి.యం.స్కూల్ వీధి, ప్రత్తిపాడు
సెల్: 9849138626

వేలం ప్రకటన
మహారాజశ్రీ ముమ్మిడివరం సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.1/2019 In O.S.73/2015

Between:-
సంగాని శ్రీనివాసరావు ...D.Hr

మరియు

రేవు సత్యనారాయణ ...J.Dr

పై నెంబర్ అమలు గ్రంథం లో D.Hr కి రావలసిన డిక్రీ బాకీ వసూలు నిమిత్తం J.Dr తాలుకు షెడ్యుల్ ధాఖలా స్థిర ఆస్తిని కోర్ట్ వారి ఇస్తిహారు షరతులుకు లోబడి **ది.02-01-2026తేది** ఉదయం **గం॥ 10.30** నిమిషములు నుండి వేలం కాబడును. ఆసక్తి కలవారు పై కోర్ట్ వారి ఎదుట హాజరై పాడుకోన వచ్చును వివరముల కొరకు పై కోర్ట్ నజారత్ నందు కాని D.Hr అడ్వొకేట్ గారి ఆఫీస్ నందు కాని తెలుసుకోవలెను

షెడ్యూలు

Dr. B.R. అంబేద్కర్ కోనసీమ జిల్లా (పూర్వం తూర్పు గోదావరి జిల్లా) ఐ.పోలవరం SRO, ఐ.పోలవరం మండలం G.మూలపోలం శివారు యర్రగరువు, G.వేమవరం రెవిన్యూ గ్రామం జిరాయితీ మెరక పల్లం **R.S. No.489/5, Ac.0-50** సెంట్లుకు హద్దులు

తూర్పు:- మెల్లం సింహాచలం గారి ఆస్తి, **దక్షిణం:-** K.లోవరాజు గారి ఆస్తి, **పడమర:-** మోర్త ప్రభుదాస్ గారి ఆస్తి, **ఉత్తరం:-** మెల్లం సింహాచలం గారి ఆస్తి

ఈ హద్దుల మధ్య గల Ac.0-50 సెంట్లు జిరాయితీ మెరక పల్లం మామూలు నీటి మార్గములు ఈజ్మెంట్ హక్కులు సర్వం సహా.

D.Hr Value: రూ.5,00,000-00
Amin Value: రూ.5,00,000-00

(శ్రీ కోర్టు వారి అనుమతిన)
జి.వి.రామారావు
అడ్వకేట్, ముమ్మిడివరం, ఫోన్.9290286024